

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ
మునగాల మండలం ఆకుపాములలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందారు.
- 8లో



వినయ్ కుటుంబాన్ని ఆదుకోవాలి
లెఫ్టినెంట్ కల్నల్ వినయ్‌భానురెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.
- 8లో



వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కుగా ఉంటుంది.



న్యూస్‌రీల్

గ్రూప్ 1 పరీక్షలకు ఉచిత శిక్షణ

నల్లగొండ: తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నిరుద్యోగ బీసీ అభ్యర్థులకు గ్రూప్ 1 పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ స్టడీ సర్కిల్ జిల్లా డైరెక్టర్ విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో శిక్షణ పొందిన వారికి అవకాశం లేదని, 10 నుంచి డిగ్రీ వరకు మెమోలతోపాటు కులం, ఆదాయం తదితర సర్టిఫికెట్లతో ఈనెల 27 నుంచి 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

31వరకు పింఛన్ల పంపిణీ

నల్లగొండ: జిల్లాలో శనివారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు ఆసరా పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు డీఆర్‌డీఓ కాళిందిని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్‌దారులంతా వారివారి ప్రాంతాల్లో గతంలో మాదిరిగానే పింఛన్లు తీసుకోవాలని కోరారు.

డీటీడీఓ ద్వారా వేతనాలు చెల్లించాలి

నల్లగొండ టౌన్: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లో పనిచేస్తున్న డైలీవేజ్ పార్ట్‌టైం, ఫుల్ టైం వర్కర్లకు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ద్వారానే నేరుగా వేతనాలను చెల్లించాలని తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలల డైలీవేజ్ హాస్టల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బి.మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నల్లగొండలోని డీటీడీఓ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. అన్ని జిల్లాల్లో డీటీడీఓ ద్వారా వేతనాలను చెల్లిస్తుంటే నల్లగొండలో మాత్రం వార్డెన్లు, పాఠశాలల హెచ్‌ఎంల ద్వారా వేతనాలను చెల్లించడం ఎంతవరకు న్యాయమన్నారు. జిల్లాలో సుమారు 200 మంది డైలీవేజ్ వర్కర్లకు ఎనిమిది నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అనంతరం డీటీడీఓ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, యూనియన్ నాయకులు బి.సంగ్యానాయక్, పి.శేషు, శంకర్‌నాయక్, చీనానాయక్, నరేష్, కమల పాల్గొన్నారు.

27న జాబ్‌మేళా

నల్లగొండ: జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 27న ఉదయం 10గంటలకు నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారిణి ఎస్.పద్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి రూ.10వేల నుంచి రూ.25వేల వరకు వేతనాలు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఎస్సెస్సీ, డిగ్రీ చదివి 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తిగాల అభ్యర్థులు బయోడేటా, ఒర్జినల్ సర్టిఫికెట్లతో సకాలంలో హాజరు కావాలని కోరారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు

రామగిరి(నల్లగొండ): కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాలకుర్తి కృష్ణమూర్తి అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కొత్త వేతన సవరణ సంఘాన్ని నియమించాలని, జీవన భృతి పొందే పెన్షనర్లకు ఆదాయ పన్ను రద్దు చేయాలన్నారు. రైల్వే ఛార్జీలలో 50శాతం రాయితీని పునరుద్ధరించాలని, పొదుపు ఖాతాలపై 12 శాతం వడ్డీ చెల్లించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నూకల జగదీష్‌చంద్ర, ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్, గౌరవ అధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, కోశాధికారి అబ్దుల్ ఖాదర్, సభ్యులు పాదూరి విద్యాసాగర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు యానాల కృష్ణారెడ్డి, పాదూరి రమణారెడ్డి, వల్లూరి బంగారయ్య, పులి కృష్ణమూర్తి, రంగారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, సోమయ్య, సలీం అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

● ఆత్మీయ సమ్మేళనం



నార్కట్‌పల్లి మండలం జువ్విగూడెంలో శనివారం జరిగిన బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, చిత్రంలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి తదితరులు

పేపర్ లీక్ ఘటనతో జిల్లాకు లింక్ ?

- ఆరుగురిపై అనుమానం
- కూపీలాగుతున్న సిట్

నల్లగొండ క్రైం : టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ సంఘటనతో జిల్లాకు లింక్ ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సిట్ పోలీస్ బృందం కూపీ లాగుతున్నట్లు సమాచారం. శనివారం సిట్ అధికారులు జిల్లాకు చెందిన ఆరుగురు సభ్యులకు సంబంధించిన సమాచారం రహస్యంగా విచారిస్తునట్లు పోలీస్ వర్గాల ద్వారా తెలిసింది. ఆ పరీక్షలో జిల్లా నుంచి క్వాలిఫై ఐన వారి నుంచి సిట్ అధికారులు వివరాలు తెలుసుకుంటున్నారు. ఒక ఫోన్ కాల్ ఆధారంగా గుట్టు లాగుతున్నట్లు నిరుద్యోగులు చర్చించుకుటున్నారు.

ఉపాధి సగమే..

ఈ ఏడాది లక్ష్యం మేర పనిదినాలు కల్పించని యంత్రాంగం

- సెంట్రల్ సాఫ్ట్‌వేర్‌తో తలెత్తిన సాంకేతిక సమస్యలు
- కరోనా తర్వాత తగ్గిన కూలీలు
- కూలి గిట్టుబాటు కాకపోవడమే ప్రధాన కారణం
- ఆరు రోజుల్లో ముగియనున్న ఆర్థిక సంవత్సరం



జాబ్ కార్డులు	3,52,950
కూలీల సంఖ్య	7,59,000
పనిదినాల లక్ష్యం	1.03 కోట్లు
కల్పించింది	57లక్షలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఈ ఆర్థిక సంవత్సరం (2022–23) మరో ఆరు రోజుల్లో ముగియనుంది. ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన పనుల లక్ష్యం సగమే నెరవేరింది. మిగితా సగం అలాగే ఉండిపోయింది. జిల్లాలో ఉపాధి హామీ జాబ్‌కార్డులు కలిగిన కుటుంబాలకు ఈ ఏడాది 1,03,83,000 పని దినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించినా అందులో ఇప్పటి వరకు కేవలం 57లక్షల పని దినాలు మాత్రమే కల్పించారు. నిర్దేశించిన లక్ష్యంలో మిగితా సగం పని దినాలు కల్పించలేని పరిస్థితి జిల్లాలో నెలకొంది.

గిట్టుబాటుకాని కూలి

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీలో అమల్లోకి తెచ్చిన సెంట్రల్ సాఫ్ట్‌వేర్‌లో పనిచేసే కూలీల పేర్లతో ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేయాల్సి ఉంది. ఏరోజుకారోజు కూలీలు నిర్వహించిన పనికి సంబంధించి ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు సార్లు ఫొటోలు తీసి, పని ప్రదేశం నుంచే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. మస్టర్‌లో నమోదు చేసి ఆన్‌లైన్ చేయాలి. అప్పుడే కూలీలకు రెండు పూటల వేతనాలు ఇచ్చే అవకాశం ఉంటుంది. ఒకేసారి ఫొటో తీయడం, రెండు పూటల ఫొటోలు తీయకపోవడం, రెండు పూటలు మస్టర్‌లో నమోదు చేయకపోవడంతో రెండు పూటలు పనిచేసినా, చేయనట్లుగానే చూపిస్తోంది. మరోవైపు చాలా మంది ఆధార్ అనుసంధానం కాలేదు. దీంతో కూలీలకు ఎప్పటికప్పుడు రెండుపూటల కూలిడబ్బులు అందడం లేదు. పైగా ప్రతిరోజూ ఒక కూలీకి రూ.257 కనీస వేతనం అందాలి. ఎండల తీవ్రతతో వారు మధ్యాహ్నం ఎక్కువ సమయం పని చేయలేకపోతున్నారు. దీంతో రోజు రూ.150 నుంచి రూ.200 వరకే కూలి వస్తోంది. దీంతో కూలీలు పనులకు రావడం తగ్గించారు. ఫలితంగా జిల్లాలో ఉపాధి హామీ లక్ష్యం నెరవేరని పరిస్థితి నెలకొంది.

వివిధ కారణాలతో వెనుకబాటు

కరోనా నేపథ్యంలో పట్టణాల నుంచి గ్రామాలకు వచ్చిన ప్రజలు కరోనా తర్వాత తిరిగి పట్టణాల బాటపట్టారు. దీంతో కూలీల సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. మరోవైపు కూలీలకు రావాల్సిన కూలి కంటే తక్కువ కూలి పడడం, పథకం అమలులో కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన సెంట్రల్ సాఫ్ట్‌వేర్‌తో సాంకేతిక ఇబ్బందులు తలెత్తాయి. వీటికితోడు వెంటనే వేతనాలందకపోవడం, ఎండ తీవ్రత పెరగడంతో ఉపాధి హామీ లక్ష్యం చేరుకోవడంలో జిల్లా వెనుకబడింది.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో ఎస్పీ, అదనపు కలెక్టర్లు

● కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నల్లగొండ: ప్రజలందరూ మత సామరస్యం పాటిస్తూ ప్రశాంతవాతావరణంలో పండుగలను సంతోషంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. ఈనెల 23 నుంచి రంజాన్ మాసం ప్రారంభం కావడం, మార్చి 30న శ్రీరామ నవమి, ఏప్రిల్ 6న హనుమాన్ జయంతి, 7న గుడ్ ఫ్రైడే, 9న ఈస్టర్ పండుగలు ఉన్న నేపథ్యంలో శనివారం జిల్లా కలెక్టరేట్‌లో ఎస్పీ అపూర్వరావు, అదనపు కలెక్టర్‌లు ఖుష్బూ గుప్తా, భాస్కర్‌రావులతో కలిసి శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాంతి కమిటీ సభ్యులు చేసిన సలహాలు సూచనలు అనుసరించి పండుగల సందర్భంగా జిల్లా యంత్రాంగం వివిధ శాఖల ద్వారా అవసరమైన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. వరుస పండుగల నేపథ్యంలో చక్కెర సరపరా చేయాలని పలువురు ముస్లిం మత పెద్దలు, వివిధ సౌకర్యాలు కల్పించాలని శాంతి కమిటీ సభ్యులు గోలి మధుసూధన్ రెడ్డి, సభ్యులు డాక్టర్ ఏఏ ఖాన్, హఫీజ్ ఖాన్ కోరగా ప్రభుత్వానికి నివేదిస్తూ లేఖ రాస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. పండుగల సందర్భంగా పాలు, నెయ్యి ఇతర పదార్థాలు కల్తీ లేకుండా తనిఖీలు నిర్వహించాలని ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మద్యం, బెల్ట్ షాపులను నియంత్రణ చేయాలని ఎక్సైజ్ శాఖ అధికారిని ఆదేశించారు. అనంతరం జిల్లా ఎస్పీ అపూర్వ రావు మాట్లాడుతూ శాంతిభద్రతల సమస్య లేకుండా ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకునేలా పోలీస్ శాఖ ద్వారా బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాత్రి పూట గస్తీ, సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. సోషల్ మీడియా ద్వారా రెచ్చ గొట్టే, మత సామరస్యం భంగం కలిగించేలా, హింసను ప్రేరేపించేలా పోస్టింగ్‌లు పెడితే చర్యలు తప్పవన్నారు. వీటిపై ఎస్పీ కార్యాలయంలో సోషల్ మీడియా సెల్ ద్వారా నిఘా ఉంచామన్నారు. అబ్దుల్ ఖలీం, హాషం, రఫీ ఇతర సభ్యులు పలు సూచనలు చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ ప్రసాదరావు, డీఎస్పీలు, అధికారులు పాల్గొన్నారు.

నిల్వ చేసినా నిరీక్షణే..!

- తగ్గుతున్న పత్తి ధర
- ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.5,800 నుంచి రూ.7వేల లోపే..
- గతేడాది రూ.12వేల వరకు అమ్మిన రైతులు
- ఆ ధర వస్తదేమోనని ఆశతో ఇళ్లలోనే నిల్వ



నల్లగొండ అగ్రికల్చర్: పత్తి ధర రోజురోజుకూ పతనం అవుతోంది. గత సంవత్సరం మాదిరిగా అధిక రేటు పలుకుతుందని అప్పటిదాకా ఆగి అమ్ముకుందామని భావించిన రైతులు తాము పండించిన పత్తిని ఇళ్లలోనే నిల్వ చేశారు. ప్రస్తుతం యాసంగి సీజన్ ముగిసే సమయంలో కూడా దగ్గర పడుతుండడం, పత్తికి మంచి ధర రాకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. ఇంకా ఎన్ని నెలలు నిల్వ ఉంచుకోవాలో ఎప్పుడు అమ్మాలో తెలియక నిరీక్షిస్తున్నారు.

సీజన్ ప్రారంభంలో..

ఈ ఏడాది పత్తి సీజన్ ప్రారంభంలో ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.6,380 ఉన్నప్పటికీ వ్యాపారులు, జిన్నింగ్ మిల్లుల్లో అక్టోబర్ నెలలో క్వింటాల్‌కు రూ.7,500 వరకు కొనుగోలు చేశారు. అయితే గతేడాది మాదిరిగా క్వింటాల్ ధర రూ.12 వేలకు పెరుగుతుందని రైతులు పత్తిని అమ్మకుండా ఇళ్లలో నిల్వ ఉంచారు. ధర తగ్గుతుండడంతో నాలుగైదు నెలలుగా పత్తిని అమ్ముకోలేక, పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ప్రస్తుతం ఇలా..

ప్రస్తుతం జిల్లాలోని వ్యాపారులు, జిన్నింగ్ మిల్లు యజమానులు పత్తిని క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.7 వేలు, కనిష్ఠంగా రూ.5,800లకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. అయినప్పటికీ రైతులు పత్తిని అమ్ముకోవడానికి ముందుకు రావడం లేదు. ఏప్రిల్ నెలలోనైనా పత్తి ధర పెరుగుతుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారు.

రంగుమారుతున్న పత్తి

నాలుగైదు నెలలుగా ఇళ్లలోనే పత్తిని నిల్వ చేస్తుండడంతో మొత్తం రంగుమారే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రంగు మారడంతో పాటుగా పత్తిగింజలు తేమను కోల్పోయి తూకం చాలా వరకు తగ్గే అవకాశం ఉండడంతో పత్తి రైతుల పరిస్థితి మాత్రం అగమ్యగోచరంగా మారింది.

6.41లక్షల ఎకరాల్లో పత్తిసాగు

జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో రైతులు సుమారు 6.41లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. అకాల వర్షం కారణంగా దిగుబడులు ఆశించిన స్థాయిలో రాలేదు. ఎకరాకు 8 క్వింటాళ్ల చొప్పున మొత్తం 51 లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసినప్పటికీ ఎకరానికి 5 క్వింటాళ్ల చొప్పు 32 లక్షల క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. ఇందులో కేవలం 5.56లక్షల క్వింటాళ్ల పత్తిని మాత్రమే రైతులు అమ్ముకున్నట్లు మార్కెటింగ్ శాఖ గణాంకాలు చెపుతున్నాయి. ఇంకా రైతుల వద్ద 26.50లక్షల క్వింటాళ్ల పత్తి నిల్వ ఉన్నట్టు అంచనా.

నేరస్తులకు శిక్ష పడేలా చూడాలి



శిక్షణకు హాజరైన పోలీస్ సిబ్బంది

● ఎస్పీ అపూర్వరావు



మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం: కోర్టు కేసుల విషయంలో సాంకేతికపరంగా అన్ని ఆధారాలు సేకరించి కోర్టులకు అందజేసి నేరస్తులకు శిక్షలు పడేలా చూడాలని జిల్లా ఎస్పీ అపూర్వరావు అన్నారు. శనివారం నల్లగొండలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో కోర్టు డ్యూటీ పోలీస్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. కోర్టు కేసుల్లో శిక్షల శాతం పెరగాలని, సాక్ష్యాల రికార్డు, బాధితులు అందించే సమాచారం ఇతర మార్గాల ద్వారా అందే సమాచారం సేకరణలో కాలయాపన చేయొద్దన్నారు. తప్పు చేసిన ప్రతి ఒక్కరికీ శిక్ష పడితేనే మరోసారి సంఘటనలు పునరావృతం కావని చెప్పారు. నేరస్తులకు జైల్ శిక్ష పడితేనే బాధితులకు పోలీసుల పట్ల భరోసా, గౌరవం పెరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డీసీఆర్‌బీ డీఎస్పీ రమేష్, సీఐ రాఘవులు, ఐటీ సెల్ సుదర్శన్ చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల గొంతునొక్కుతున్న ప్రధాని మోదీ

● డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

మాడుగులపల్లి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించకుండా ప్రధాని నరేంద్రమోదీ ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ ధ్వజమెత్తారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నిర్వహించిన భారత్ జోడోయాత్రకు వచ్చిన ఆదరణ చూసి ఓర్వలేకే లోక్‌సభలో ఆయన సభ్యత్వాన్ని రద్దు చేశారని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు వందమంది మోదీలతోనేనా కాంగ్రెస్ పోరాడుతుందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ పుల్లెంల సైదులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మాధవరెడ్డి, ఎరుకల వెంకన్న, నాగిరెడ్డి, మోహన్, సింగం ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 10న వాక్‌ఇన్ ఇంటర్వ్యూ

నల్లగొండ టౌన్: నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 14 ట్యూటర్ పోస్టుల భర్తీకి ఏప్రిల్ 10న ఉదయం 11 గంటలకు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనాటమీ, సైకాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మటాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాల్లో మూడు సంవత్సరాల కాల పరిమితికి గాను నెలకు రూ.55,700 పారితోషికంతో కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు మెడికల్ కళాశాల వెబ్‌సైట్‌లో పొందుపర్చిన దరఖాస్తును డౌన్‌లోడు చేసుకొని ఏప్రిల్ 1 సాయంత్రం 5గంటల వరకు ప్రిన్సిపాల్ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

బకాయిలు నూరుశాతం రాబట్టేలా..

- స్త్రీనిధి రుణం వాయిదాల వసూలుపై డీఆర్‌డీఏ ప్రత్యేక దృష్టి
- 28వ తేదీలోగా రికవరీ చేసేలా కార్యాచరణ సిద్ధం
- ఇటీవలే అధికారులకు దిశానిర్దేశం చేసిన కలెక్టర్



2022-23 ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి రుణ వివరాలు

మొత్తం స్వయం సహాయక సంఘాలు **5,013**

స్త్రీనిధి కింద అప్పుగా ఇచ్చిన రుణం	ఓవర్ డ్యూ కింద పడిపోయింది
రూ.316,63,80,331	రూ.28,26,22,280

నల్లగొండ : జిల్లాలో స్త్రీనిధి కింద రుణాలు పొందిన సంఘాలు వాటిని తిరిగి చెల్లించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నాయి. దీంతో బకాయిలు పెద్ద ఎత్తున పేరుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించని సంఘాల నుంచి బకాయిలు వసూలు చేసేందుకు డీఆర్‌డీఏ సంస్థ ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసింది. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, డీఆర్‌డీఓ కాళిందిని రుణ బకాయిలపై దృష్టి సారించారు. వీటిపై ఇటీవల జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి ఈనెల 28వ తేదీలోగా ఓవర్ డ్యూ అయిన సంఘాల నుంచి బకాయిలు రాబట్టాలని దిశానిర్దేశం చేశారు. అయితే వరుసగా మూడు నెలలకంటే ఎక్కువకాలం నెలవారీ చెల్లింపులు జరపని సంఘాలను ఓవర్ డ్యూ కింద బ్యాంకు పరిగణిస్తోంది. జిల్లా వ్యాప్తంగా రూ. 28.26 కోట్లు ఓవర్ డ్యూ ఉంది.

అడవిదేవులపల్లిలో అధిక సంఘాలు ..

ఓవర్ డ్యూ ఉన్న మండలాల్లో కట్టంగూర్‌లో రూ.2.52 కోట్లు, మిర్యాలగూడ రూ.1.70 నార్కట్‌పల్లి రూ.1.67 కోట్లు దామరచర్లలో రూ.1.65 కోట్లు, నాంపల్లి రూ.1.36 కోట్లు మాడ్గులపల్లిలో రూ.1.30 కోట్లు, త్రిపురారం రూ.1.29 కోట్లు గుర్రంపోడు రూ.1.25 కోట్లు పీఏపల్లిలో రూ.1.4 కోట్లు బకాయిలు వసూలు కావాల్సి ఉంది. కనగల్, నిడమనూరు, తిరుమలగిరిసాగర్ రూ.కోటి చొప్పున ఉన్నాయి. మరో 10 మండలాల్లో రూ.కోటి వరకు ఉండగా, మిగతా మండలాలు రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. తక్కువ ఓవర్ డ్యూ ఉన్న మండలంగా చండూరు ఉంది. అక్కడ రూ.5.3 లక్షలు మాత్రమే వసూలు కావాల్సి ఉంది. రుణాలు చెల్లించనివి అడవిదేవులపల్లి మండలంలో అత్యధికంగా 70శాతం సంఘాలు ఉన్నాయి. ఈ మండలంలో రూ.1.36 కోట్లు వసూలు కావాల్సి ఉంది.

ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలి



స్త్రీనిధి ద్వారా మహిళా సంఘాలు తీసుకున్న రుణ బకాయిలను వెంటనే చెల్లించాలి. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెనెలాఖరులోగా నూటికి నూరు శాతం రుణ బకాయిలను వసూలు చేసేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలి.

– కాళిందిని, డీఆర్‌డీఓ, నల్లగొండ

మార్కెట్‌లలో ‘అన్నపూర్ణ’

- రైతులకు 5 రూపాయలకే భోజనం
- ధాన్యం కొనుగోళ్ల సీజన్‌లో అమలు చేసే యోచనలో ప్రభుత్వం
- జిల్లాలోని 10 మార్కెట్ యార్డుల్లో ప్రారంభంకానున్న క్యాంటీన్లు



నల్లగొండ అగ్రికల్చర్: ధాన్యం అమ్ముకునేందుకు వ్యవసాయ మార్కెట్ యార్డులకు వచ్చే రైతుల ఆకలి తీర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే అన్నపూర్ణ పథకం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు వివిధ కూడళ్లలో రూ.5లకే భోజనం అందిస్తున్న విషయం తెలిసిందే. దీంట్లో భాగంగా రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లోనూ అన్నపూర్ణ పథకాన్ని అమలు చేస్తూ మార్కెట్లకు వచ్చే రైతులకు తక్కువ ధరకే భోజనం పెట్టాలన్న కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందుకు సంబంధించిన విధివిధానాలను త్వరలో ఖరారు చేయనుంది.

జిల్లాలో పది మార్కెట్లలో..

జిల్లాలోని మిర్యాలగూడ, దేవరకొండ, నల్లగొండ, నకిరేకల్, చిట్యాల, చండూరు, వెంకటేశ్వరనగర్ (మాల్), నిడమనూరు, హాలియా, శాలిగౌరారంతో కలుపుకొని మొత్తం పది మార్కెట్లలో ఈ పథకాన్ని అమలు చేయనుంది. వానాకాలం, యాసంగి సీజన్లలో ధాన్యం, పత్తి, ఇతర పంటలను అమ్మేందుకు వ్యవసాయ మార్కెట్లకు వచ్చే రైతులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందనున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి సీజన్‌లో రోజూ నాలుగు నుంచి ఆరు వేల మంది రైతులు తమ పంటలను అమ్ముకోవడానికి వ్యవసాయ మార్కెట్లకు వస్తుంటారు. ధాన్యం సకాలంలో అమ్మకం జరుగకపోతే రాత్రి వేళల్లో అక్కడే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో రైతులు ఆకలి తీర్చుకోవడం కోసం వివిధ రకాల క్యాంటీన్లు, హోటళ్లను ఆశ్రయించి అధిక డబ్బులు ఖర్చు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పేద రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తీర్చాలని ప్రభుత్వం మార్కెట్లలో అన్నపూర్ణ భోజన పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుత యాసంగి ధాన్యం కొనుగోళ్ల సీజన్ వరకు ఈ పథకాన్ని అమలు చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది.

మార్గదర్శకాలు రావాల్సి ఉంది



అన్నపూర్ణ పథకం అమలుకు సంబంధించిన ఎలాంటి గైడ్‌లైన్స్ రాలేదు. ప్రభుత్వ నిర్ణయించిన విధంగా పథకాన్ని అమలు చేసి రూ.5కే భోజనం అందించడం వల్ల నిరుపేద రైతులకు ఉపయోగంగా ఉంటుంది. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చిన వెంటనే పథకాన్ని అమలు చేస్తాం.

– శ్రీకాంత్, జిల్లా మార్కెటింగ్ అధికారి

మంచి నిర్ణయం



ధాన్యం అమ్మకం సమయంలో రైతులు రోజుల తరబడి వ్యవసాయ మార్కెట్లలో ఉండాల్సి రావడంతో భోజనానికి అధిక మొత్తం ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో అన్నపూర్ణ పథకం ద్వారా మార్కెట్లలో రైతులకు రూ.5కే భోజనం అందించాలని ప్రభుత్వం భావించడం మంచి నిర్ణయం.

– ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రైతు సంఘం నాయకుడు

క్లుప్తంగా

అనారోగ్యంతో అడ్లూరు సర్పంచ్ మృతి

కోదాడరూరల్ : మండల పరిధిలోని అడ్లూరు సర్పంచ్ అంబటిపూడి స్వరాజ్యం(75) అనారోగ్యంతో మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం అస్వస్థతకు గురై మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. పులిచింతల పునరావస కేంద్రమైన అడ్లూరుకు ఆయన మొదటి సర్పంచ్. ఆదివారం ఆయన అంత్యక్రియలు జరగనున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు సంతాపం వ్యక్తం చేశారు.

ఏఆర్ డీఎస్పీకి ఏఎస్పీగా పదోన్నతి

నల్లగొండ క్రైం : జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఆర్ డీఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్న సురేష్‌కుమార్‌కు ఏఎస్పీగా శనివారం పదోన్నతి లభించింది. పదోన్నతి పొందిన ఆయనను మహబూబ్‌నగర్‌కు బదిలీ చేస్తూ నార్త్ జోన్ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్ఎస్ఐగా 1996 సంవత్సర బ్యాచ్‌కు చెందిన సురేష్‌కుమార్ ఏఆర్‌డీఎస్పీగా ఆరేళ్లుగా జిల్లా పోలీస్‌కార్యాలయంలో బాధ్యతలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ అపూర్వరావు ఆయనను అభినందించారు. అనంతరం ఆయనకు వీడ్కోలు సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రసాద్ రావు, ఆర్ఐలు నరసింహాచారి, స్పర్జన్ రాజు, శ్రీను, హరిబాబు, సంతోష్, కృష్ణారావు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలని అర్ధనగ్న ప్రదర్శన

యాదగిరిగుట్ట రూరల్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా బస్వాపురం రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న భూములకు పరిహారం, పునరావాసం కల్పించాలని కోరుతూ లప్పానాయక్ తండా వాసులు చేపట్టిన నిరసన దీక్షలు శనివారం 10వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రిజర్వాయర్ కట్టపైన గ్రామస్తులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు నిరసన దీక్షలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ దీరావత్ బుజ్జి శంకర్, ఉపసర్పంచ్ మంక్యా నాయక్, బిచ్చానాయక్, తండా వాసులు పాల్గొన్నారు

ఆవుల కాపరులపై కేసు

మాడుగులపల్లి: అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై ఆవుల మందలను తోలుకెళ్తున్న ముగ్గురు కాపరులపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని కొత్తగూడెం వద్ద ఆవుల కాపరులు కేతావత్ నర్సింహ, రమావత్ శ్రీను, నేతాల అంజయ్య రహదారిపై వందల సంఖ్యలో ఆవులను తోలుకెళ్తూ వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించి, ప్రయాణికులను తీవ్ర అసౌకర్యానికి గురిచేశారని కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఇటీవల వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం వద్ద తెల్లవారుజామున ఓ ట్రావెల్స్ బస్సు మందపైకి దూసుకెళ్లడంతో పలు ఆవులు మృత్యువాతపడ్డాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రహదారిపై ప్రమాదకరంగా పశువులను తోలుకెళ్లే వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

నిలిచున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ

- ఇద్దరు మహిళా కూలీలు దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- హైవేపై మునగాల మండలం ఆకుపాముల శివారులో దుర్ఘటన


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్ తదితరులు


ప్రమాదానికి కారణమైన లారీ

మునగాల(కోదాద): సూర్యాపేట జిల్లా మునగాల మండలం ఆకుపాముల శివారు జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళా కూలీలు దుర్మరణం చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. నడిగూడెం మండలం రామాపురం గ్రామానికి చెందిన 14మంది కూలీలు ఉదయం జీఎమ్మార్ సంస్థకు చెందిన ట్రాక్టర్‌లో వచ్చి ఆకుపాముల శివారులో రహదారి మధ్యలో ఉన్న పూల మొక్కల పాదులు సరిచేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే లారీ రహదారిపై నిలిపిన జీఎమ్మార్ సంస్థ ట్రాక్టర్‌ను వేగంగా ఢీకొట్టి సుమారు 50 అడుగుల దూరం వరకు ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై ఉన్న రోషమ్మతో పాటు దాని పక్కనే పనిచేస్తున్న నేలమర్రి వినోద (27), తుమ్మల ధనమ్మ (60)కు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ దాసుకు స్వల్ప గాయాలయ్యాయి. సమీప కూలీలు గమనించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగానే వినోద మృతిచెందింది. మిగిలిన ముగ్గురిని కోదాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ తుమ్మల ధనమ్మ ప్రాణాలు విడిచింది. రోషమ్మ పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది. మృతురాలు వినోదకు కుమారుడు, భర్త, ధనమ్మకు భర్త, కుమారుడు,కుమార్తె ఉన్నారు.మృతురాలు వినోద భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు.

ఘటనాస్థలాన్ని సందర్శించిన ఎస్పీ


వినోద (ఫైల్)


ధనమ్మ(ఫైల్)

జాతీయ రహదారిపై ఆకుపాముల శివారులో జరిగిన ప్రమాద ఘటన స్థలాన్ని సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్ సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లారీ డ్రైవర్ తప్పిదం, అజాగ్రత్త మూలంగానే ప్రమాదం జరిగిందన్నారు. ఇందుకు కారణమైన లారీ డ్రైవర్‌పై ఐపీసీ సెక్షన్ 304 పార్టు–2ప్రకారం కేసు నమోదు చేసి పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ వెంట కోదాడ డీఎస్పీ జి.వెంకటేశ్వరరెడ్డి, మునగాల సీఐ ఆంజనేయులు, మునగాల ఎస్ఐ లోకేష్ ఉన్నారు. ఈ ప్రమాదంతో జాతీయరహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో పోలీసులు ట్రాఫిక్‌ను ఆకుపాముల గ్రామం మీదుగా మళ్లించారు. అనంతరం ట్రాక్టర్‌ను క్రేన్‌తో తొలగించి జాతీయరహదారిపై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కాగా, రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలను, క్షతగాత్రులను స్థానిక ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయించేందుకు కృషిచేస్తానని తెలిపారు.

శోకసంద్రంలో రామాపురం

నడిగూడెం : మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన తుమ్మల ధనమ్మ (55), నేలమర్రి వినోద (25) శనివారం మునగాల మండలం ఆకుపాముల వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలకు చెందిన ధనమ్మ, వినోదల మృతికి గ్రామస్తులు కంటతడి పెట్టారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తెలంగాణలో హ్యాట్రిక్ విజయం సాధిస్తాం


కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ఎమ్మెల్యే లింగయ్య

- ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలి
- మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

నార్కట్‌పల్లి : తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ, జిల్లా ఇంచార్జ్ కడియం శ్రీహరి ధీమా వ్యక్తం చేశారు. నవంబర్‌లో ఎన్నికలు వచ్చే అవకాశాలు ఉన్నాయని, అవి ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. నార్కట్‌పల్లి మండలం జువ్విగూడెం గ్రామంలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి ప్రతిపక్షాలకు కనబటం లేదా అని ప్రశ్నించారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు నిధులు ఇస్తున్న కేంద్రం తెలంగాణకు మాత్రం మొండి చేయి చూపిస్తుందని ఆరోపించారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా తీసుకెళ్తున్న ఘనత కేసీఆర్ దేనని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు రైతులు విద్యుత్ కోతలతో అనేక ఇబ్బందులు పడేవారిని, కాని నేడు ఆ సమస్య లేకుండా పోయిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు రుణ మాఫీ చేస్తుంటే బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు వేల కోట్ల రూపాయలను మాఫీ చేసి దేశ సంపదనను కొల్లగొడుతుందని విమర్శించారు. రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేసి ప్రజా స్వామ్యాన్ని మోదీ అపహాస్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరే విధంగా కేసీఆర్ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. ముందుగా జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పంపిన లేఖ సందేశాన్ని చదివి వినిపించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండూరు శంకర్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, రైతు సమితి అధ్యక్షులు యానాల అశోక్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు వాజిద్ అలీ, సర్పంచులు బద్దం వరలక్ష్మి, మాధవి, ఉపేందర్, ఎంపీటీసీ రాజిరెడ్డి, యాదయ్య, కుమారస్వామి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మల్లెబోయిన సైదులు, ప్రమీల, సైదులు, సందీప్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని రైల్వే ఉద్యోగి మృతి

యాదగిరిగుట్ట రూరల్: రైలు ఢీకొని రైల్వే ఉద్యోగి మృతిచెందాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి రైల్వే ట్రాక్ పరిధిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బి.దశరథమ్ (44) సిగ్నల్, టెలికమ్ డిపార్ట్‌మెంట్‌లో ఈఎస్ఎమ్ గ్రేడ్–1 ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజువారీ విధుల్లో భాగంగానే వంగపల్లి పరిధిలోని రైల్వే ట్రాక్ పక్కన సిగ్నల్స్‌కు సంబంధించిన మిషన్ పాయింట్ బాక్స్ 106 బి వద్ద మిషన్లను తనిఖీ చేస్తున్నాడు. ఈ సమయంలో వరంగల్ నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని మహిళ..

భువనగిరి : రైలు ఢీకొని మహిళ మృతిచెందింది. భువనగిరిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని అర్బన్‌కాలనీకి చెందిన గుమ్మడి లక్ష్మి(60) శనివారం కాలనీ నుంచి పట్టణంలోకి వచ్చేందుకు భువనగిరి రైల్వే స్టేషన్ చివరి ప్లాట్ ఫాం సమీపం నుంచి రైల్వే ట్రాక్ దాటుతుండా సికింద్రాబాద్ నుంచి కాజీపేట వైపు వెళ్తున్న గుర్తుతెలియని రైలు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై అశోక్‌కుమార్ తెలిపారు.

డీసీఎంను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- ఐదుగురు ప్రయాణికులకు గాయాలు


డీసీఎంను వెనుక నుంచి ఢీకొట్టిన బస్సు

చౌటుప్పల్ : రోడ్డు వెంట ఆగివున్న డీసీఎం వాహనాన్ని ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో బస్సులోని ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని లక్కారం గ్రామ శివారులో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లోని పికెట్ డిపోకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడకు వెళ్తుంది. ఆ క్రమంలో మధ్యాహ్నం సమయంలో వర్షం కురుస్తుండడంతో లక్కారం గ్రామ శివారులో జాతీయ రహదారి పక్కన ఓ డీసీఎం డ్రైవర్ వాహనాన్ని రోడ్డు పక్కన ఆపాడు. అదే సమయంలో వచ్చిన లగ్జరీ బస్సు డ్రైవర్ తన ముందున్న డీసీఎం వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో బస్సులోని ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంతో విజయవాడ మార్గంలో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. గాయపడిన ప్రయాణికులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స తీసుకొని వెళ్లారు.

లెఫ్టినెంట్ కల్నల్ వినయ్ కుటుంబాన్ని ఆదుకోవాలి

- సీఎం కేసీఆర్‌ను కలిసి విన్నవిస్తా
- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



లెఫ్టినెంట్ కల్నల్ వినయ్ భానురెడ్డి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ కోమటిరెడ్డి, విప్ సునీత

బొమ్మలరామారం : లెఫ్టినెంట్ కల్నల్ వినయ్‌భానురెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ఈ విషయమై సీఎం కేసీఆర్‌ను కలిసి విజ్ఞప్తి చేస్తానని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బొమ్మలరామారం మండల కేంద్రంలో శనివారం కల్నల్ వినయ్ భానురెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. వినయ్ కుటుంబానికి హైదరాబాద్‌లో 500 గజాల ఇంటి స్థలంతో పాటు భార్య స్పందనారెడ్డికి ఐఏఎస్ అధికారిగా అవకాశం కల్పించాలన్నారు. వినయ్ స్వగ్రామంలో తన సొంత నిధులతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని చెప్పారు. ఆయన వెంట టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య ఉన్నారు.

కల్నల్ కుటుంబానికి ప్రభుత్వం అండ : విప్

లెఫ్టినెంట్ కల్నల్ వినయ్‌భానురెడ్డి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కల్నల్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. దేశ రక్షణ రంగంలో విశిష్ట సేవలను అందిస్తు వీర మరణం పొందిన కల్నల్ వినయ్ భాను రెడ్డి మృతి తీరనిదన్నారు. అలాగే జెడ్పీ చైర్మెన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి సైతం కల్నల్ వినయ్ భాను రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సుధీర్ రెడ్డి, పోలగొని వెంకటేష్ గౌడ్, గూదే బాల్ నర్సింహ తదితరులు ఉన్నారు.

'యాదాద్రి' సూపరింటెండెంట్‌పై సస్పెన్షన్ వేటు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణశర్మపై ఈఓ గీతారెడ్డి సస్పెన్షన్ వేటు వేసినట్లు ఆలయ వర్గాల ద్వారా ఆలస్యంగా తెలిసింది. తరచు తన విధులకు గైర్హాజరు అవుతున్న నేపథ్యంలో ఈఓ గీతారెడ్డి నాలుగు రోజుల క్రితమే సస్పెండ్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈవో కార్యాలయ అధికారులకు ఎలాంటి సమాచారం లేకుండా సత్యనారాయణశర్మ విధులకు గైర్హాజరు అవుతున్న నేపథ్యంలో ఈవో పలుమార్లు హెచ్చరించినా తీరు మారకపోవడంపై సస్పెండ్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

శివాలయంలో కొనసాగుతున్న ఉత్సవాలు


స్వామివారికి హారతినిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి కొండపైన అనుబంధ ఆలయమైన శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి (శివాలయం)లో శ్రీసీతారామచంద్రస్వామి వారి వసంత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం నిత్యారాధనల అనంతరం ఆలయ అర్చకులు శ్రీసీతారామచంద్రస్వామి వారి వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీసీతారామ హనుమత్ మూలమంత్ర జపములు, దశశాంతి పంచసూక్త పారాయణములతో అభిషేకం, ఆధ్యాత్మ రామాయణ పారాయణం, అష్టోత్తర శత నామార్చన వంటి పూజలను జరిపించారు. రాత్రి 7గంటల నుంచి శ్రీసీతారామ హనుమాన్ మూర్తులకు సహస్ర నామార్చనలు, నివేదన, నీరాజన, మంత్రపుష్పములు నిర్వహించి, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు.

స్వామివారిని దర్శించుకున్న ఐపీఎస్ అధికారులు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని కేరళ, ఢిల్లీకి చెందిన పీజీపీ (ఐపీఎస్)లు సుదర్శన్, ప్రశాంత్ కానీ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తుల చెంత అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. శ్రీస్వామిని దర్శించుకున్న వీరికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారి రాజు లడ్డూ ప్రసాదం అందజేశారు.

పొర్లుదండాలతో యాదాద్రీశుడి చెంతకు


పొర్లుదండాలతో యాదగిరిగుట్టకు చేరుకున్న నాగయ్యస్వామి

యాదగిరిగుట్ట : వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని, కేసీఆర్ మరోసారి సీఎం కావాలని కోరుకుంటూ సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం ధనసిరి గ్రామానికి చెందిన నాగయ్యస్వామి 21 కిలో మీటర్లు పొర్లుదండాలతో శనివారం యాదాద్రీశుడి చెంతకు వచ్చాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న సీఎం కేసీఆర్ మరోసారి అధికారంలోకి వచ్చేలా దీవించాలని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని వేడుకుంటూ ధనసిరి గ్రామం నుంచి 210 కిలో మీటర్లు బీఆర్ఎస్ నాయకులతో పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 22వ తేదీ నుంచి బీబీనగర్ నుంచి 21 కిలో మీటర్ల దూరం పొర్లు దండాలతో యాదాద్రి వైకుంఠద్వారం వద్దకు చేరుకున్నట్లు చెప్పారు. ఆయన వెంట అశోక్, దశరథ, బక్కారెడ్డి, పిరప్ప, రాజ్‌కుమార్, రాజు, మల్లప్ప తదితరులు ఉన్నారు.

నశీంపేటలో విషాదఛాయలు


మధు అంత్యక్రియలకు హాజరైన జనం

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : నిశ్చితార్థం జరగాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆత్మకూర్ (ఎస్) మండలం నసీంపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన ముల్కపల్లి మధు (30) సూర్యాపేటలోని రియలన్స్ డిజిటల్ షోరూంలో సెల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. కాగా, మధు అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. పెద్దల అంగీకారంతో నేడు వివాహానికి శుభ ముహూర్తం నిర్ణయించుకునేందుకు ఏర్పాట్లు కూడా చేసుకున్నారు. శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని వస్తూ మార్గమధ్య రోళ్లబండతండా వద్ద రోడ్డు ప్రమాద బాధితులకు సాయం చేసిన మధు తిరిగి వస్తున్న క్రమంలో కారు మృత్యువు రూపంలో కబళించడంతో శుభకార్యం జరగాల్సిన ఇంట విషాదఛాయలు అలుముకున్నాయి. తెల్లవారితే లగ్నపత్రిక రాయాల్సిన ఇంట బంధు, మిత్రుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. శనివారం సాయంత్రం మధు అంత్యక్రియలు నిర్వహించారు.

గ్రాసం కోసం పశువుల వలస


పెద్దవూరలో ప్రధాన రహదారిపై గుంపులుగా వెళ్తున్న పశువులు

పెద్దవూర: నల్లగొండ జిల్లా చందంపేట, నేరెడుగొమ్ము మండలాలకు చెందిన రైతులు తమ పశువులను మేత కోసం ఇతర ప్రాంతాలకు తోలుకెళ్తున్నారు. ప్రస్తుతం ఎండాకాలం ప్రారంభం కావడంతో అడవులు ఎండిపోయి పశుగ్రాసం దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో పశువులు ఉన్న ఐదాగురు రైతులు కొందరిని కూలీలను ఏర్పాటు చేసుకుని పశువులను ఆయకట్టు ప్రాంతాలకు తోలుకెళ్తారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాకు సైతం పశువులను మేపటానికి తోలుకెళ్తారు. పశువులను మేపుకుంటూ వెళ్లి, ఐదారు నెలల పాటు ఆయకట్టు ప్రాంతాలలో మేపుకుని తిరిగి వర్షాకాలం ప్రారంభమయ్యే నాటికి తమ స్వగ్రామాలకు వెళ్తుంటారు. పది రోజుల క్రితం పశువులతో కాపరులు తమ స్వగ్రామాల నుంచి బయలు దేరారు. శనివారం పెద్దవూరలో జడ్చర్ల–కోదాడ ప్రధాన రహదారిపై వందలాదిగా పశువులు ఒకేసారి వెళ్తుండడం కనిపించింది.

చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి

శాలిగౌరారం: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చొల్లగూడెం గ్రామానికి చెందిన బొల్లగోని నాగయ్య (74) కొన్ని నెలలుగా తల, ఒంటినొప్పులతో బాధపడుతున్నాడు. ఈనేపథ్యంలో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కొంత సమయం తర్వాత ఇంటికి వచ్చిన కుటుంబికులు నాగయ్య అపస్మారక స్థితిలో కనిపించడంతో వెంటనే ఆటోలో నకిరేకల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నాగయ్య పరిస్థితి విషమంగా మారడంతో వైద్యుల సూచనమేరకు నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతునికి భార్య, వివాహితులైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని మనుమడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళలు అదృశ్యం

పాలకవీడు: వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. పాలకవీడు, తిరుమలగిరి మండలాల పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. పాలకవీడు మండలంలోని బెట్టెతండాకు చెందిన లావుడ్య రమేష్, వెన్నెలకు 2017లో వివాహం జరిగింది. వీరికి కుమార్తె, కుమారుడు. ఈ నెల 14వ తేదీన భర్త రమేష్‌తో గొడవపడి కుమారుడు విజయ్(18 నెలలు)బాబుతో వెన్నెల ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కోపంతో వెళ్లిందికదా తిరిగి వస్తుందిలే అనుకున్నారు. రోజులు గడుస్తున్నకొద్దీ భర్త రమేష్ వెతకడం ప్రారంభించాడు. ఆచూకీ కోసం తెలిసిన బంధువులందరికీ ఫోన్ చేసి సంప్రదించాడు. ఫలితం లేకపోవడంతో రమేష్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదులు తెలిపాడు.

కొంపల్లిలో ..

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని కొంపల్లి కి చెందిన బెజిలి మహేశ్వరీ ఈనెల 24న ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రానికి కూడా తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం మహేశ్వరీ తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ బాబు తెలిపారు.